తేది: 11.04.2017

ద్రావిడ విశ్వవిద్యాలయం ఎమెనో భవనంలో బుధవారం జగ్జీవన్‌రామ్ జయంతి, జ్యోతిరావు పూలే జయంతి, అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వర్శిటీ ఉపాధ్యక్షులు ఆచార్య ఇ.సత్యనారాయణ గారు మాట్లాడుతూ... ఆదర్శంతులు సామాజిక సంస్కర్తలు అయిన జగ్జీవన్‌రామ్, జ్యోతిరావు పూలే, డా.బి.ఆర్.అంబేద్కర్‌లు సమకాలీనులు కాకపోయినప్పటికీ వీరి ధ్యేయం సామాజిక అభివృద్ధి, సమసమాజ స్థాపనే అని అన్నారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా డా.జి.వెంకటనారాయణ, డా.ఎమ్.ఎన్.వినోదిని, డా.సుధాకర్‌లు విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా డా.జి.వెంకటనారాయణ గారు మాట్లాడుతూ... సరస్వతీ నిలయాలైన విశ్వవిద్యాలయాల్లో రాజకీయ జోక్యంతో కుల, మత బేధాలు ఏర్పడి దుష్పరిణామాలకు దారితీయడం భాదాకరమన్నారు. మొట్టమొదటి సామాజిక సంస్కర్త జ్యోతిరావు పూలే అయితే, సమసమాజ స్థాపనకు డా.బి.ఆర్.అంబేద్కర్ తన భావాలను రాజ్యాంగంలో పొందుపర్చారని అన్నారు. 190 సంవత్సరాల క్రితమే సామాజిక ఉద్యమాలు లేవనెత్తి సమాజాభ్యున్నతికి తోడ్పడిన జ్యోతిరావు పూలే గురించి వంద సంవత్సరాల తరువాత వరకు వెలుగులోకి రాలేకపోయారన్నారు. విద్యాలయాల్లో కుల వివక్ష ఉండకూడదని, విద్యావంతులుగా మెలగాలంటే సంస్కారవంతులుగా ఉండాలని, ఈ గుణాలు లేకుంటే జీవితానికి సార్థకత ఉండదన్నారు. ప్రతి రోజూ సామాజిక సంస్కర్తలైన జగ్జీవన్‌రామ్, జ్యోతరావు పూలే, డా.బి.ఆర్.అంబేద్కర్‌లను, స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలన్నారు. డా. వినోదిని గారు మాట్లాడుతూ... వర్ణ వ్యవస్థ నిర్మూలనకు మొదట బుద్ధుడు పూనుకున్నాడని, అదేవిధంగా జ్యోతిరావు పూలే వర్ణ వ్యవస్థ నిర్మూలనకు కొత్త పంథాను ఎన్నుకుని పౌరులకు విద్య నేర్పినట్లైతే సమాజంలోని రుగ్మతలను పోగొట్టొచ్చని భావించారన్నారు. ఈ విషయాన్ని ఆచరణలో పెడుతూ తన సతీమణి అయిన సావిత్రిభాయి పూలేను విద్యావంతురాల్ని చేస్తూ ఆమె ద్వారానే అనేక మంది బాలికలను విద్యావంతులను చేసి మార్గదర్శులుగా నిలిచారన్నారు. కొత్త దంపతులైన మొదట్లోనే జ్యోతిరావు పూలే, సావిత్రిభాయి పూలేలు ఆనందంతో సంసార జీవితాన్ని గడపడానికి బదులు సమాజం వైపు మనసును మరల్చి సమాజాభివృద్ధికి తోడ్పడ్డారన్నారు. డా.బి.ఆర్. అంబేద్కర్ కేవలం హరిజనులను మాత్రమే చైతన్యవంతుల్ని చేయడమే కాక, సమాజంలోని అగ్రవర్ణాలకు చెందిన వారిలో మార్పు తీసుకురావడానికి మార్పు తీసుకురాగలిగారన్నారు. డా.సుధాకర్ మాట్లాడుతూ... అధర్మం వైపు సమాజం వెళ్తున్నప్పుడు దాన్ని సరిచేసి మంచివైపు మళ్ళించడానికి జ్యోతిరావు పూలే, డా.బి.ఆర్.అంబేద్కర్, జగ్జీవన్‌రామ్‌లు ప్రయత్నించారన్నారు. ఎస్.ఆర్.శంకరన్ ఐఎస్ఎస్‌గా ఈనాటి సమాజంలో ఆదర్శంతులని ఈ సందర్భంగా తెలిపారు.

ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య జి.బాలసుబ్రమణియన్, డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య ఎస్.పెంచలయ్య, ఆచార్య రాజేంద్రప్రసాద్, ఆచార్య నారాయణప్ప, ఆచార్య శ్రీనివాస కుమార్, డా.శ్రీదేవి, డా.మురళీకృష్ణారెడ్డి, పరిశోధక విద్యార్థులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



